

ర్యాలీ నిర్వహిస్తున్న బాలానగర్ జోన్ ట్రాఫిక్ పోలీసులు

మీకోసం.. మీ భద్రత కోసం.. హెల్మెట్ ధరించండి

పేట్‌బషీరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జరిమానాలు తప్పించుకోవడానికో, పోలీసుల కోసమో కాదు... మీకోసం, మీభద్రత కోసం హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. బుధవారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బాలానగర్ జోన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డినగర్ డివిజన్ గుడెన్‌మెట్టు చౌరస్తా నుంచి బాలానగర్ డిమార్ట్ వరకు పోలీసులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం టూకె వాక్‌ను విశ్వ విశ్వాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, భాగ్యరథీ కళాశాల విద్యార్థులతో నిర్వహించారు. హెల్మెంట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని ఏసీపీ శ్రీనివాస్, పోలీసులు ఐడీపీఎల్ చౌరస్తాలో వాహనదారులకు తెలియజేశారు. కార్యక్రమంలో బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేష్, ఎస్ఐ రాజేశ్వర్,జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్ఐలు యాదగిరి, సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

● కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దూలపల్లి, సుచిత్ర, కుత్బుల్లాపూర్, షాపూర్‌నగర్, గాజులరామారం తదితర చౌరస్తాల్లో విశ్వ విశ్వాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో దాదాపు 2వందల మంది విద్యార్థులతో కలిసి సీటుబెల్ట్, హెల్మెట్ ధరించాలని బ్యానర్లు పట్టుకొని వాహనదారులకు వివరించారు. హెల్మెట్ ధరించకపోతే జరిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాన కల్పించారు.



కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం కూకట్‌పల్లిలోని ఐడీఎల్ రోడ్డులో 2కె వాక్ చేపట్టారు. ఈసందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, ఇన్‌స్పెక్టర్ నగేష్, ఎస్సైలు పాల్గొన్నారు.

- కూకట్‌పల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి)

వివాదాస్పద భూముల పరిశీలన

గచ్చిబౌలి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండల పరిధిలోని వివాదాస్పద భూములను రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్య, శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. మి యాపూర్, హఫీజ్‌పేట, ఖానామేట్, చందానగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న భూములను పరిశీలించినట్టు ఆర్డీఓ తెలిపారు. మియాపూర్ సర్వేనెంబర్ 100 ప్రభుత్వ భూమి పర్యవేక్షణ హెచ్‌ఎండీఏకు అప్పగించడం జరిగిందన్నారు. సర్వేనెంబర్ 100ను సందర్శించిన సమయంలో అక్రమంగా నిర్మిస్తున్న రెండు ప్రహరీలను, ఓనిర్మాణాన్ని తొలగించామన్నారు.

కిసాన్ అగ్రి షోలో 'పెర్‌ఫెక్ట్' ఉత్పత్తులు

● ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు ప్రదర్శన



'పెర్‌ఫెక్ట్' బాటిల్

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ప్రధానకేంద్రంగా సేవలందిస్తున్న క్రాఫ్ట్ ఫౌండేషన్, గ్లోబల్ గ్రీన్ అగ్రినోవా నిర్వహణలోని 'పెర్‌ఫెక్ట్' బ్రాండ్ ఉత్పత్తులను హైదరాబాద్‌లోని హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు జరిగే కిసాన్ అగ్రి షోలో ప్రదర్శించనున్నారు. ఈ మేరకు సంస్థ బెంగళూరులో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. వృక్ష ఆయుర్వేదంతో 11 వనమూలికల ఔషధ సమ్మేళనంగా ఉన్న 'పెర్‌ఫెక్ట్' మందు సమగ్ర సస్యరక్షణకు దోహదపడుతుందన్నారు. పంట పొలాలు, తోటల్లో అధిక దిగుబడి సాధించేలా రసాయనిక అవశేషాలు లేని విధంగా విస్తృత పరిశోధనల అనంతరం 'పెర్‌ఫెక్ట్‌'ను తయారు చేసినట్టు సంస్థ పేర్కొంది. వైరస్ బారి నుంచి పంటలను, తోటలను కాపాడే గొప్ప గుణాలు ఇందులో ఉన్నాయని గ్లోబల్ గ్రీన్ అధినేత బీఎస్.మూర్తి పేర్కొన్నారు. హైదరాబాద్ కిసాన్ అగ్రి ప్రదర్శనలోని బీ-120 పెర్‌ఫెక్ట్ స్టాల్‌ను రైతులు, తోటల పెంపకందారులు సందర్శించి ప్రయోజనం పొందాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ చంద్రశేఖర్

బాలానగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పీఎం విశ్వకర్మ పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బాలానగర్ మైక్రోస్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ సంస్థ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం సంస్థ ఆడిటోరియంలో నిర్వహించిన పీఎం విశ్వకర్మ పథకం అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై వివరాలు వెల్లడించారు. ఇప్పటివరకు ఈ పథకం కోసం దేశవ్యాప్తంగా 85లక్షల మంది, రాష్ట్రంలో 1,14,000 మంది పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రాలు, స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రీనరీ షిప్ పంచాయతీరాజ్, మున్సిపాలిటీలకు చెందిన అధికారులు పథకాన్ని లబ్ధిదారులకు వివరించాలని సూచించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) డి.శ్రీనివాసులు మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ పథకంతో అర్హులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సదస్సులో డిప్యూటీ కమిషనర్ వెంకటరెడ్డి, స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ) హైదరాబాద్ జీఎం శ్రీహరి, మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పోవర్టీ ఇన్ మున్సిపల్ ఏరియా (ఎంఈపీఎంఏ) డైరెక్టర్ పి.పద్మ పాల్గొన్నారు.

పాతకక్షలతో దాడి.. ఉద్యోగికి గాయాలు


చికిత్స పొందుతున్న రియాజ్ అహ్మద్

మోతీనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పాతకక్షలు మనసులో ఉంచుకొని తోటి ఉద్యోగిపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. మాదాపూర్ సమీపంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మహ్మద్ రియాజ్ అహ్మద్ క్యాబ్ సూపర్‌వైజర్‌గా సయ్యద్ ఇర్ఫాన్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. విధులు కేటాయించే విషయమై వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఇర్ఫాన్ మూడు నెలల క్రితం ఉద్యోగం మానేశాడు. కక్ష పెంచుకున్న ఇర్ఫాన్ బుధవారం ఉదయం 6గంటల సమయంలో కంపెనీ బయట ప్రధాన ద్వారం వద్ద అహ్మద్‌పై కత్తితో దాడి చేశాడు. గాయపడ్డ రియాజ్ అహ్మద్‌ను సహచర సిబ్బంది ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో మాదాపూర్ ఎస్సై శ్వేత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ఇర్ఫాన్ పరారీలో ఉన్నాడు.

గంజాయి విక్రేత అరెస్టు

కూకట్‌పల్లి, జనవరి 31(ఆం ధ్రజ్యోతి): గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్న ఓ మహిళను బాలానగర్ ఎస్‌ఓటీ, కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం... మూసాపేట జనతానగర్‌లో నివాసముండే డి.వెంకటేష్(30), శోభ(25) దంపతులు కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్నారు. డ్రైవర్‌గా పనిచేసే వెంకటేష్ అధిక సంపాదన కోసం వరంగల్ ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి.. ఇంట్లోనే ప్యాకెట్లుగా తయారు చేసి భార్యతో కలిసి అమ్ముతున్నాడు. పక్కా సమాచారం అందుకొన్న పోలీసులు మంగళవారం వెంకటేష్ ఇంట్లో తనిఖీలు చేయగా.. 1.3 కిలోల బరువైన మొత్తం 56గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ పట్టుబడిన గంజాయి విలువ రూ. 56 వేలు. వెంకటేష్ మేడారం జాతరకు వెళ్లడంతో అతడిని అరెస్టు చేయలేకపోయారు. శోభను అరెస్టు చేసి బుధవారం కోర్టుకు తరలించారు.

మంజీరా నీటితో అక్రమ దందా..

● నీటిని నిల్వ చేసి ట్యాంకర్ల ద్వారా విక్రయాలు
● రూ. లక్షలు అర్జిస్తున్న నిర్వాహకులు
● ఖైతలాపూర్, కేపీహెచ్‌బీ 15వఫేజ్‌లో కొనసాగుతున్న వైనం
● పట్టించుకోని జలమండలి అధికారులు

ఇప్పటి వరకు జలమండలి ద్వారా మంజీరా నీటిని ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేయడం చూసి ఉంటాం... కానీ కూకట్‌పల్లిలో ప్రైవేటు వాటర్ ట్యాంకర్ల నిర్వాహకులు మంజీరా నీటిని అక్రమ కనెక్షన్ల ద్వారా సేకరించి మాల్స్, హోటల్స్, హాస్టల్స్‌కు సరఫరా చేస్తూ అందినకాడికి దండుకుంటున్న వైనం వెలుగులోకి వచ్చింది. లక్షల లీటర్ల మంజీరా నీటిని నిల్వ చేసి ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తూ రూ. లక్షలు సంపాదిస్తున్నారు. ఈతతంగమంతా జలమండలి అధికారులు, సిబ్బందికి తెలిసి జరుగుతున్నా... ఎటువంటి చర్యలు తీసుకోకపోవ డం గమనార్హం. కూకట్‌పల్లి ఖైతలాపూర్ ప్రాంతంలో ప్రైవేట్ ట్యాంకర్ల నిర్వాహకులు కొంతకాలంగా కొనసాగిస్తున్న అక్రమ మంజీరానీటి దందాపై ప్రత్యేక కథనం.



కూకట్‌పల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఖైతలాపూర్, కేపీహెచ్‌బీకాలనీ 15వఫేజ్ కాలనీ వెనుక వైపు రైల్వే ట్రాక్ సమీపంలోని ఖాళీ స్థలంలో కొన్నేళ్లుగా ప్రైవేట్ ట్యాంకర్ల నిర్వాహకులు అక్రమంగా బోర్లు వేసి నీటిని విక్రయిస్తున్నారు. కొంతకాలంగా స్థానిక బోర్లు వేసవిలో ఎండిపోతుండడంతో అక్రమ మార్గం వైపు దృష్టి సారించారు. చందానగర్ నుంచి ఖైతలాపూర్ మీదుగా వెళ్తున్న భారీ మంజీరా పైపులైన్‌పై కన్నేశారు. స్థానిక జలమండలి అధికారులు, సిబ్బంది సహకారంతో ఒక టిన్నర అంగుళాల కనెక్షన్లను తీసుకొని నీటిని భారీగా నిల్వ చేసి ట్యాంకర్ల ద్వారా కమర్షియల్‌గా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గంటకు 10వేల లీటర్ల చొప్పున మంజీరా పైపులైన్ ద్వారా సేకరిస్తున్నారు. 10కిలో లీటర్ల(కేఎల్) ట్యాంకర్‌ను రూ.1000-1500, 30కేఎల్ ట్యాంకర్ నీటిని రూ. 3,000 - 4000 చొప్పున మాల్స్ హోటల్స్ హస్టల్స్‌కు విక్రయిస్తున్నారు.

మౌనంగా జలమండలి అధికారులు, సిబ్బంది

కూకట్‌పల్లిలో వాటర్ ట్యాంకర్ల నిర్వాహకుల బరితెగింపుపై జలమండలి అధికారులు మౌనంగా ఉండడంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ అక్రమంగా బోర్లు వేసి భూగర్భ జలాలను తోడుతూ నీటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు.. ఏకంగా జలమండలికి చెందిన భారీ పైపులైన్ నుంచి పెద్దఎత్తున నీటిని అక్రమ కనెక్షన్ల ద్వారా సేకరిస్తూ విక్రయాలు చేపడుతుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాలనీలు, బస్తీవాసులకు సరిపడా మంచినీటిని సరఫరా చేయడంలో విఫలమవుతున్నా జలమండలి అధికారులు అక్రమనీటి కనెక్షన్లను ప్రోత్సహిస్తుండడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. కూకట్‌పల్లిలోని ఖైతలాపూర్ సమీపంలో జరుగుతున్న అక్రమ మంజీరా నీటి దందా నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వ్యక్తమవుతోన్నది.

వెంటనే చర్యలు తీసుకుంటాం

ఖైతలాపూర్, కేపీహెచ్‌బీకాలనీ 15వ ఫేజ్ వెనుక ఉన్న ఖాళీ స్థలాల్లో మంజీరా నీటిని అక్రమ నీటి కనెక్షన్ల ద్వారా సేకరించి, విక్రయాలు చేపడుతున్నట్లు మా దృష్టికి రాలేదు. వెంటనే స్థానిక అధికారులు, సిబ్బందితో కలిసి తనిఖీ చేపడతాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. మంజీరా నీటిని అక్రమంగా నిల్వ చేసి విక్రయాలు చేపడుతున్నట్టు తేలితె కఠిన చర్యలు తీసుకుంటాం.

- ప్రభాకర్‌రావు, జీఎం, కూకట్‌పల్లి జలమండలి

ముంపు సమస్యకు పరిష్కారం చూపాలి


ఐడీఎల్ చెరువు వద్ద నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అధికారులు

కూకట్‌పల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని ఐడీఎల్ చెరువు నుంచి వెళ్లే నాలాను అభివృద్ధి చేసి ముంపు సమస్యకు సత్వర పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. స్వాన్‌లేక్ కాలనీ వెనుక ఐడీఎల్ చెరువు నాలాను బుధవారం ఆయన పరిశీలించారు. రెండేళ్ల వర్షాకాలంలో నాలా పొంగి అపార్ట్‌మెంట్స్ బస్తీల్లోని ఇళ్లల్లోని వర్షపునీరు వచ్చి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కూకట్‌పల్లి బస్‌డిపో ఎదుట జాతీయరహదారిపైకి వచ్చే వర్షపునీటి వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని ఎమ్మెల్యే చెప్పారు. రెవిన్యూ, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి.. వర్షాకాలం వచ్చేలోపు నాలాను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వామి, టౌన్‌ప్లానింగ్ సిటీ ప్లానర్ ఉమాదేవి, ఏసీపీ మల్లేశ్వర్, ఇరిగేషన్ ఈఈ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ రోనాల్డ్‌రోస్

గచ్చిబౌలి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జోన్ పరిధిలో జరగాల్సిన అభివృద్ధి పనులను పూర్తిచేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ అధికారులను ఆదేశించారు. బుధవారం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై చందానగర్, శేరిలింగంపల్లి, రామచంద్రపురం సర్కిళ్ల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోనాల్డ్‌రోస్ మాట్లాడుతూ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న ఎస్‌ఎఫ్‌ఏలు, పారిశుధ్య కార్మికులు సంయుక్తంగా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. దశలవారీగా రోడ్లపై, చెరువులు, కుంటల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం, ఇళ్ల నిర్మాణ వ్యర్థాలను దశల వారీగా తొలగించాలని సూచించారు. గేటెడ్ కమ్యూనిటీల్లో చెత్తను సేకరించే విధంగా చెత్తడబ్బాలు ఏర్పాటు చేయాలని, వినియోగంలోని మరుగుదొడ్లు తొలగించాలని ఆదేశించారు. అంతకుముందు జోనల్ కమిషనర్ స్నేహశబరీష్ అడిషనల్ కమిషనర్, పారిశుధ్య విభాగం, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి దుర్గంచెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రహరీలు, వాకింగ్ ట్రాక్ మొదలైన ఇంజనీరింగ్ పనులను పరిశీలించారు. దుర్గంచెరువు పరిసర ప్రాంతాల్లో తినుబండరాల బళ్లను వెంటనే తొలగించాలని, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేయరాదని ఆమె హెచ్చరించారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు వెంటనే తొలగించి ప్రజలకు సౌకర్యంగా ఉండేలా చూడాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ పరిధిలోని అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు కొమురయ్య, గిరివర్ధన్‌రెడ్డి

దుండిగల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): దుండిగల్-గండిమైసమ్మ పరిధిలోని జ్యోతిరావ్ పూలే క్రికెట్ స్టేడియంలో పల్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లే ఫర్ మల్కాజ్‌గిరి క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం బీజేపీ నాయకుడు, ఫౌండేషన్ ఛైర్మన్ మల్క కొమురయ్య జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధి నుంచి మొత్తం 40 జట్ల నుంచి 440 మంది క్రీడాకారులు ఆడుతున్నారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విక్రం, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగారావు, మేడ్చల్ రూరల్ జిల్లా కార్యదర్శి అతిష్ బాబు, దుండిగల్ బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివార్ యాదవ్, బీజేపీ కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం


బస్తీ వాసుల సమస్యలు వింటున్న రమేష్

బాలానగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తోందని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బుధవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్‌లో బస్తీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా స్థానికులు తమ బస్తీల్లోని సమస్యలు విన్నవించారు. బస్తీలో మౌలిక సదుపాయాలు కల్పించేలా బస్తీ నాయకులు ఒక కమిటీగా ఏర్పడాలని ఆయన బస్తీ నాయకులకు సూచించారు. అధికారులతో కలిసి ఒక నివేదికను రూపొందించి ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, మహిళా కాంగ్రెస్ కార్యదర్శి కొండకింది పుష్పారెడ్డి, ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షుడు మధుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

యాదయ్య కుటుంబానికి అండగా ఉంటా

బేగంపేట్ తాతాచారీకాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు యాదయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకుని కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తగా సభ్యత్వం తీసుకోగా పార్టీ నుంచి వచ్చిన రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ బీమా చెక్కును యాదయ్య సతీమణి విమలకు అందజేశారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

షాపూర్‌నగర్, జనవరి 31(ఆంధ్యజ్యోతి): తనను భారీ మెజార్టీతో గెలిపించిన మైనార్టీలకి కృతజ్ఞుడనని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్ షాపూర్‌నగర్ ప్రధాన రహదారిలోని ఎంజేఎస్ గార్డెన్‌లో మర్కాజీ జమియాతుల్ అన్సారి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 15వ సర్వసభ్య సమావేశం, సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధి సంక్షేమం చూసి ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించారని, తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన మైనార్టీ సోదరులకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, వేణుయాదవ్, రుద్ర అశోక్, మర్కాజీ జమియాతుల్ అన్సారి సంఘం అధ్యక్షుడు గౌస్, ప్రధాన కార్యదర్శి గోరేమియా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు

షాపూర్‌నగర్: సూరారం డివిజన్ శివాలయనగర్‌లో జగదాంబదేవి వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పూజారి దుర్గా మహారాజ్, శేఖర్ మహారాజ్, గోపాల్‌నాయక్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

పేట్‌బషీరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ 44 రహదారి పనులను, కొంపెల్లి చౌరస్తానుంచి బహదూర్‌పల్లి వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బుధవారం పరిశీలించారు. ఈ పనులు పూర్తి అయితే వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తీరుతాయన్నారు. కొంపెల్లి మున్సిపాలిటీ ప్రారంతాల్లో ఎమ్మెల్యే 18వ రోజు కృతజ్ఞత యాత్ర స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్, వైస్‌ఛైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

'సమస్యలను పరిష్కరించండి'

గాజులరామారం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మహదేవపురం కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహదేవపురం కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రంగారా వు, జాయింట్ సెక్రటరీ ప్రసాద్, రామచంద్రారెడ్డి, ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



● రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావును హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రభాకర్, గణేష్, రవిందర్

- దుండిగల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి)

సీసీరోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆల్విన్ కాల డివిజన్ పరిధిలోని విజయనగర్‌కాలనీ హైటెన్షన్‌లైన్ రోడ్డులో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించి త్వరగా పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్వరూపా, రఘుపతి, పోశెట్టి గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం ఉండొద్దు


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

హైదర్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ హెచ్‌ఎంటీ హిల్స్, ప్రగతినగర్ రోడ్డులో కొనసాగుతున్న మంజీర పైపులైన్ మరమ్మతు పనులు, ట్రాఫిక్ మళ్లింపుపై ట్రాఫిక్ సీఐ వెంకటేష్, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, వాటర్ బోర్డు అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేసి నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు ఏఈలు ప్రశాంతి, రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, సయ్యద్‌ఖాజా, లైన్‌మన్ సునీల్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, స్థానికులు పాల్గొన్నారు.



● ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి సందర్భంగా జగద్గిరిగుట్ట బస్టాప్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ జగన్, స్థానిక నాయకులు

- జీడిమెట్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి)



● 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తిపన్ను వసూళ్లలో భాగంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి రాఘవేంద్ర కాలనీలోని సాజిద్‌బేగ్ నుంచి రూ. 7.65 లక్షల ఆస్తి పన్నును బుధవారం వసూలు చేసిన ఉపకమిషనర్ నర్సిహ, ఏఎంసీ కృష్ణ, టాక్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బిల్ కలెక్టర్ బాలకృష్ణ

- కుత్బుల్లాపూర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి)



● ఎమ్మెల్సీలు మహేష్ కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్‌ను బుధవారం సెక్రటేరియట్‌లో కలిసి శాలువాతో సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు ఏ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, ఎం.పూర్ణచందర్, దుర్గాప్రసాద్, సాయి

- పేట్‌బషీరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి)

వాహనాల స్టిక్కర్ ఆవిష్కరణ

ఫతేనగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టి భారత్ జోడో న్యాయ్ యాత్రకు సంబంధించిన వాహనాల స్టిక్కర్‌ను బుధవారం కాంగ్రెస్ నాయకుడు శేరి సతీష్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవ్‌రావు, అరవింద్‌రెడ్డి, కొమ్ముబాబు, సతీష్, రావుఫ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



● శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను కాపాడాలని, అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని సచివాలయంలో కలిసి విన్నవిస్తున్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

- మియాపూర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి)

బాలానగర్ సీఐగా నవీన్‌కుమార్



బాలానగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బాలానగర్ సీఐగా పి.నవీన్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన కే.భాస్కర్ సైబరాబాద్‌కు బదిలీ కావడంతో బాలానగర్‌జోన్‌లో స్పెషల్ బ్రాంచ్(ఎలక్షన్‌సెల్)విధులు నిర్వహించే పి.నవీన్‌కుమార్ బదిలీపై వచ్చారు.

ఇంక్రిమెంట్ ఇప్పించండి

● జేఎన్‌టీయూ వీసీకి కాంట్రాక్టు ఆచార్యుల వినతి

హైదరాబాద్ సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తమకు ఇంక్రిమెంట్ బకాయిలు వెంటనే ఇప్పించాలని జేఎన్‌టీయూ కాంట్రాక్టు ఆచార్యులు బుధవారం వైస్ చాన్స్‌లర్‌ను కోరారు. విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతి ఏటా రూ. 1300 ఇంక్రిమెంట్ ఇవ్వాలని గత ప్రభుత్వం 2018 ఏప్రిల్‌లో జారీ చేసిన జీవో 11ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జేఎన్‌టీయూలో 2011 నుంచి 224 మంది కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారని, అప్పట్నుంచి సర్వీసును పరిగణించాలని, ఇక్రిమెంట్‌ను వర్తింపజేయాలని వారు కోరారు. ఇతర యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ ఆచార్యులకు నెల వేతనం రూ. 65 వేలు వస్తుండగా, తమకు రూ. 43వేలు మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. ఈ విషయమై వైస్ చాన్స్‌లర్ స్పందిస్తూ కాంట్రాక్టు ఆచార్యులకు 2018కి ముందు సర్వీసును పరిగణనలోకి తీసుకోవడం, అప్పట్నుంచే ఇంక్రిమెంట్, బెనిఫిట్స్ ఇచ్చే అంశాలను ప్రభుత్వానికి తెలియజేశామని, ఆర్థిక శాఖ నుంచి అనుమతి రాగానే అమలు చేస్తామని చెప్పారు. వీసీని కలిసిన వారిలో జేఎన్‌టీయూ కాంట్రాక్ట్ ఆచార్యుల సంఘం ప్రతినిధులు రాజేశ్‌ఖన్నా, శ్రీనివాస్‌రెడ్డి, దశరధం ఉన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

● సీఎంకు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల విజ్ఞప్తి

పంజాగుట్ట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదేళ్లుగా వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నామని, స్టాఫ్ నర్సు ఫలితాల్లో ఉత్తీర్ణులైన తమను రెగ్యులరైజ్ చేయాలని పలువురు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు ఇస్లాముద్దీన్ అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో స్టాఫ్ నర్సు ఫలితాల్లో ఉత్తీర్ణులైన వారు పాల్గొన్నారు. సుమారు 600మంది గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు సేవలందిస్తున్నట్టు వారు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నష్టపోయామని, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. వివిధ సంఘాల ప్రతినిధులు షేక్ సత్తార్ సాహెబ్, సొగరా బేగం, లాజర్, రాంచందర్, స్టాఫ్ నర్సుల ప్రతినిధులు ఎస్.చైతన్య, పి.సౌజన్య, మంజుల, నిర్మల, సరిత పాల్గొన్నారు.